
# ప్రజలకు తెలియని 'ప్రజాభిప్రాయం'!

**ప్రజాభిప్రాయ సేకరణ మన మనోభీష్టానికి అనుగుణంగా చేయడం మనకే తెలియకుండా జరిగిపోతుంటుంది. దేశంలో భారతీయ జనతా పార్టీపట్ల అనుకూలత ఎంత ఉన్నదో ఏమోగానీ మీడియాలో మెండుగా ఉంది.**

'ఒపీనియన్ పోల్స్'ను నిషేధించడం రాజ్యాంగ విరుద్ధం అవుతుందన్న సోలీ సొరాబ్జీ అభిప్రాయం సరైనదే. కానీ దాని అర్థం పత్రికలు, ఇతర ప్రసార సాధనాలు ఈ విషయంలో కొంత స్వయం నియంత్రణ పాటించకూడదని కాదు.

సత్యాన్ని తెలుసుకుంటే తప్పేముంది అనవచ్చు. ఒకటి, ఒపీనియన్ పోల్స్ రేపు జరగబోయే సత్యాన్ని ముందే చెప్తాయా లేక ఆ సత్యాన్ని రూపకల్పనచేసే ఒక శక్తిగా పనిచేస్తాయా అంటే రెండూ నిజాలేననీ, ఒక్కొక్కసారి మొదటిదానికంటె రెండవది ఎక్కువ నిజం కాగలదనీ చెప్పకతప్పదు. రెండు, రోజుకొకటి చొప్పున పత్రికలలో ప్రచురిస్తున్న ఒపీనియన్ పోల్స్‌లోని శాస్త్రీయత ఎంత అంటే సందేహమే. సరైన పద్ధతిలో జరపకపోతే అది వాస్తవాన్ని ప్రతిఫలించేదికాక కల్పనకు వాస్తవంగా చలామణి చేసే ప్రక్రియ కాగలదు.

మూడు, ఎన్నికలలో ఎవరు గెలవబోతారన్న కుతూహలం ఉండడం సహజమే. అయినప్పటికీ ఎన్నిక రెండుపార్టీల మధ్యనో మూడు పార్టీల మధ్యనో పందెం కాదు. అది ప్రజలు తమ ప్రతినిధులను ఎంపిక చేసుకునే ప్రక్రియ. దానిని గుర్రప్పందెంతో సమానం చేసే వికృతమైన ప్రయత్నం రాజకీయపార్టీలు, విశ్లేషకులూ చేస్తూనే ఉన్నారు. 'ఒపీనియన్ పోల్స్' దాని పరాకాష్ఠ.



నిజానికి ఎన్నికల నేపథ్యంలో అసలు విషయాల చర్చ స్థానాన్ని ఎన్ని కృత్రిమ విషయాలు ఆక్రమించుకుంటున్నాయో చూస్తే ఆశ్చర్యం కలుగుతుంది. ఫిరాయింపులు, పునరాగమనాలు, సినిమాతారల ప్రవేశ నిష్క్రమణలు, తిట్లు, శాపనార్థాలు, ఓట్ల సమీకరణ ఎత్తుగడలు- వీటి మధ్య అసలు ఎన్నికలు ఎందుకోసం జరుపుకుంటున్నామన్న విషయం అందరూ మరచిపోయినట్టున్నాము. ఎవరు గెలవబోతారన్న ఎగ్జైట్‌మెంట్(ఉత్కంఠ)ను పెంచే ఒపీనియన్ పోల్స్ ఈ మరపును స్థిరీకరిస్తాయి.

నాలుగు, ప్రజాభిప్రాయ సేకరణ మన మనోభీష్టానికి అనుగుణంగా చేయడం మనకే తెలియకుండా జరిగిపోతుంటుంది. దేశంలో భారతీయ జనతా పార్టీపట్ల అనుకూలత ఎంత ఉన్నదో ఏమోగానీ మీడియాలో మెండుగా ఉంది. ఆ పార్టీని ఏమాత్రం ఇబ్బంది పెట్టకుండా వారి వ్యూహాలో ఎత్తుగడలో వ్యాఖ్యానించడం ప్రసార సాధనాలు బాగా అలవరచుకున్నాయి. రోజూ పత్రికలలోనూ టీవి చానల్స్‌లోనూ బిజెపి గురించి మనకు లభిస్తున్న చిత్రంలో ఎక్కడ అయినా ఏ మూలనయినా అది రెండంటే రెండేళ్ళ క్రితం గుజరాత్‌లో ఘోరమైన మారణకాండకు పాల్పడిన పార్టీ అన్న జ్ఞాపకానికి చోటుందా? నక్సలైట్ల గురించి ఇవే పత్రికలు ఎప్పుడయినా కొంచెం మంచిగా రాసినా ఒక్క క్షణం కూడా వారు హింసామార్గాన్ని ఎంచుకున్నారన్న విషయం మనల్ని మరచిపోనివ్వవు. కానీ బిజెపి విషయంలో మీడియాయే ఆ విషయాన్ని మరచిపోయింది. ప్రవీణ్ తొగాడియా, నరేంద్రమోడి ఎప్పటికప్పుడు జ్ఞాపకం చేస్తూనే ఉన్నా సంకల్ప పూర్వకంగా ఆ జ్ఞాపకాన్ని పత్రికారంగం తన మెదడు నుండి తొలగించి వేసింది. ప్రజాభిప్రాయ సేకరణ కోసం వారు అడిగే ప్రశ్నలు మీద ఈ మరపు ప్రభావం లేదంటే నమ్మడం కష్టం. బిజెపి గురించి అడిగే ప్రతీ ప్రశ్నకూ ఉపోద్ఘాతంగా 2002లో ఆ పార్టీ నాయకులు భారతదేశ చరిత్రలో కనీవినీ ఎరుగని మారణకాండ జరిపించారన్న విషయాన్ని జ్ఞాపకం చేస్తూ అడిగినట్టయితే జవాబులు- రేపు వేయబోయే ఓట్లు- కొంచెం భిన్నంగా ఉండవంటే నమ్మడం కష్టం.

ప్రపంచీకరణ విషయమూ అంతే. ప్రసార సాధనాలు చాలా వరకు ఈ సంస్కరణలకు అనుకూలమే. అందుకే చంద్రబాబు నాయుడు మీడియాలో అంత అందంగా కనిపిస్తాడు, అతను 'ఏదో చేస్తున్నాడు' అనే అభిప్రాయానికి అందుకే అంత ప్రాచుర్యం లభించింది.

ఇదంతా ప్రసార సాధనాలు నిర్వహించే ప్రజాభిప్రాయ సేకరణపైన ప్రభావం చూపగలదు, తిరిగి ప్రజాభిప్రాయాన్ని ప్రభావితం చేయనూగలదు. ఒపీనియన్ పోల్స్ వట్టి బూటకమనీ వాటిని నిర్వహించేవారి కోరికల వ్యక్తీకరణే తప్ప వేరే ఏమీ కాదనీ నేననడం లేదు. ప్రస్తుతం దేశంలో ఎన్‌డిఏకే ఎక్కువ మద్దతు ఉందన్న అభిప్రాయం ఏదో ఒక అర్థంలో నిజమనే అనుకుందాం. ఆ నిజం దానిని సేకరించేవారికి నచ్చే నిజం కాబట్టి ఒకరి తరువాత ఒకరు దానిని వెలికి తీసి ప్రకటిస్తుంటే ఇంక అది నిజం కాకుండాపోయే అవకాశం ఏమైనా ఉందా? ప్రత్యామ్నాయాలు బేజారయిపోకుండా ఉండే అవకాశం ఉందా? ప్రజాభిప్రాయం అనేది ముందే ఒక రూపం తీసుకొని ఉందని అనుకున్న దానిని స్థిరీకరించి అదే వివేకం అన్న అభిప్రాయాన్ని ప్రచారం చేసే ప్రక్రియ తన గురించి తాను కేవలం 'సైంటిఫిక్'గా ఉన్నదున్నట్టు చెప్తున్నానని చెప్పుకుంటే ఆమోదించవలసిందేనా?

ఎన్నికలకు నెలరోజులు ముందు ప్రజాభిప్రాయం ఒక రూపం తీసుకొని ఉందనుకున్నా, దానిని ఒకటికి పదిసార్లు తెలియచెప్పే స్వేచ్ఛకు ఉన్న విలువ ఆ రూపాన్ని మార్చడానికి జరగగల కృషికి కూడా ఉండాలి కదా? మొదటిది రెండవ దానికి ఆటంకమైనట్టయితే అది తటస్థమైన విషయ సేకరణకాదు, పరిశోధన కాదు. అది కూడా ఒక రాజకీయమే అవుతుంది.

ప్రసార సాధనాలు రాజకీయాలకు అతీతంగా ఉండలేవు గానీ అవి ఈ అర్థంలో రాజకీయం చేయడం వాంఛనీయమా అన్నది కొంచెం ఆలోచించుకోగలిగితే బాగుంటుంది.

– కె. బాలగోపాల్